
ప్రజాశక్తి
మంగళవారం 4 ఏప్రిల్ 2023
5
పార్వతీపురం మన్యం



## మెగా క్రికెట్ టోర్నమెంట్ విన్నర్ కురుపాం



ట్రోఫీని అందుకుంటున్న కురుపాం జట్టు

**కురుపాం:** మండలంలోని దండుసూరలో మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేత గా కురుపాం జట్టు నిలిచింది. ఈ జట్టుకు వైసిపి జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షులు శెట్టి నాగేశ్వర రావు రూ.20వేలు నగదును సోమవారం అందజేశారు. రన్నర్‌గా నిలిచిన గుమ్మిడిగూడ జట్టుకు రూ.10వేలు నగదు షీల్డును అందజేశారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రీడల్లో యువత రాణించాలని, క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో గ్రామ యువత, పెద్దలు పాల్గొన్నారు.

# అభివృద్ధి జాడేది?



- తప్పిన వ్యయ ప్రయాసలు
- ఏడాదైనా కానరాని ప్రగతి
- మాటలకే పరిమితమైన సుస్థిరాభివృద్ధి
- నేడు జిల్లా తొలి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

**పార్వతీపురం మన్యం జిల్లా ఆవిర్భవించి నేటికి సరిగ్గా ఏడాది కావచ్చింది. సొంత జిల్లా కావాలన్న ఆ ప్రాంత వాసుల ఆకాంక్ష నెరవేరింది. అధికార యంత్రాంగమంతా కొలువు దీరింది. శాఖల వారీగా గదులు, కొన్నింటికి ప్రత్యేక భవనాలు ఏర్పాటయ్యాయి. ముఖ్యంగా కలెక్టరేట్‌కు అధునాతన భవనమే సమకూరింది. అన్నింటికి మించి దాదాపు 90శాతం ప్రభుత్వ శాఖలు కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలోనే ఏర్పాటయ్యాయి. దీంతో, జిల్లా వాసులకు ఉమ్మడి జిల్లాతో పోలిస్తే కలెక్టరేట్ ఇతర జిల్లా శాఖ అధికారులను కలిసేందుకు దూర భారం, ఆర్థిక ప్రయాస తగ్గింది. ఏడాదిలో సాధించిన ప్రగతి అదే. ఇంతకు మించి చెప్పకోవడానికి ఏమీ కనిపించడం లేదు. ఎన్నో వనరులు ఉన్నా వాటిని వినియోగించి, జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళిక రూపొందించడం, ఆ దిశగా కనీసం ప్రయత్నం చేయడం వంటి ఆనవాళ్లు కనిపించడం లేదు. ఎప్పటి మాదిరిగానే సంక్షేమ పథకాల హడావిడి తప్ప చెప్పకోదగ్గ విశేషాలేమీ లేవు.**

విజయనగరం జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, కురుపాం, శ్రీకాకుళం జిల్లాలోని పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గాలు కలిసి పార్వతీపురం మన్యం జిల్లాగా 2022 ఏప్రిల్ 4న ఆవిర్భవించిన విషయం విధితమే. ఇందులో మొత్తం 15 మండలాలు ఉన్నాయి. వాస్తవానికి ఈ ప్రాంతమంతా విజయనగరం జిల్లా 1979లో ఏర్పడక పూర్వం శ్రీకాకుళం జిల్లాలోదే. అభివృద్ధికి దూరంగా ఉండడం, పరిపాలన సౌలభ్యానికి దూరభారం కావడం వల్ల కొత్తగా విజయనగరం జిల్లా ఏర్పాటు చేసి అందులో కలిపారు. అపారమైన వనరులు ఉన్నా అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో, చాలా కాలం క్రితమే పార్వతీపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ముందుకు వచ్చింది. వైసిపి వచ్చాక ఏడాది క్రితం జిల్లాలను పెంచడంతో ఆ కల నెరవేరింది. జిల్లా అయితే ఏర్పడిందిగానీ ప్రజలు, అభ్యుదయ, అభివృద్ధి కాముకులు ఆశించిన ఆశలు మాత్రం నెరవేరే పరిస్థితులు కనిపించ లేదు. జిల్లా ఆవిర్భావం సందర్భంగా సుస్థిరాభివృద్ధి లక్ష్యం అన్న పాలకులుగానీ, ఉన్నతాధికారులుగానీ అందుకనుగుణంగా కృషి చేయడం లేదు.

మన్యం జిల్లా మొత్తం జనాభా 9.72 లక్షలు. అందులో ఎస్‌సి జనాభా 1.15 లక్షలు (11.83శాతం), ఎస్‌టి జనాభా 2.65 లక్షలు (27.26శాతం) రెండూ కలిపితే 3,81,418 (39.09శాతం) అవుతుంది. రాష్ట్రంలో అరకు జిల్లా మినహాయిస్తే అన్ని జిల్లాల కంటే గిరిజన ప్రాంతం ఎక్కువ గల జిల్లా ఇది. మొత్తం జిల్లాలో భూమి 3,93,514 హెక్టార్ల విస్తీర్ణంలో ఉండగా సాగుకు అనువైన భూమి 167961 హెక్టార్లే. కొండలు, గుట్టలు ఎక్కువ. ఇప్పటికీ గిరిజనులు పోడు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు.

ఇతర జిల్లాలతో పోల్చుకుంటే మన్యంలో వర్షపాతం ఎక్కువ. కానీ, నిల్వ చేసుకునే ప్రాజెక్టులు లేనందున వర్షం నీరు ఉపయోగ పడడం లేదు. నాగావళి నదిపై తోటపల్లి బ్యారేజి నిర్మించినా జిల్లాకు ఉపయోగం తక్కువ. 1978లో ప్రారంభించిన జంఝావతి ప్రాజెక్టు నిర్మాణం ఇప్పటికీ పూర్తికాలేదు. దశాబ్దం దాటినా అడారు గెడ్డపై చిరు ప్రాజెక్టు సైతం పూర్తి చేయలేదు. ఎక్కడికక్కడ కొండల్లో మినీ రిజర్వాయర్లు నిర్మించడం ద్వారా జిల్లా సస్యశ్యామలం చేయవచ్చు. ఎన్నో చోట్ల మినీ రిజర్వాయర్లు తక్కువ ఖర్చుతో నిర్మించే అవకాశం ఉన్నా ఈ ఏడాదిలో అటువంటి ప్రయత్నం చేయలేదు.

జిల్లాలోవున్న పరిశ్రమలు రెండేరెండు లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ షుగర్ ఫ్యాక్టరీ, జీగిరాం జ్యూట్ మిల్లు ఉన్నాయి. ప్రస్తుతం రెండూ మూతబడి ఉన్నాయి. షుగర్ ఫ్యాక్టరీ భూములను ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ చేసేసింది. కొత్తగా పరిశ్రమలు స్థాపించడం మాట అటుంచి ఉన్న షుగర్, జ్యూట్ ఫ్యాక్టరీలు ఈ ప్రభుత్వం వచ్చాకే మూతపడ్డాయి.

గిరిజన ప్రాంతం జీడి, పైనాపిల్, చింత పండు, తునికాకు తదితర అటవీ ఉత్పత్తులకు ఆలవాలం. స్థానికంగా ఫుడ్ పార్కులు ఏర్పాటు చేసి, గిరిజన ఉత్పత్తులకు గిరాకి పెంచుతామని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగుపరుస్తామని జిల్లా ఆవిర్భావ సమయంలో అధికార యంత్రాంగం ప్రగల్భాలు పలికింది. ఆచరణలో కనీస ప్రయత్నం లేదు. దీంతో, గిరిజనులు ఓవైపు దోపిడీకి గురౌతున్నారు. మరోవైపు అత్యల్ప ఆదాయంతో మెరుగైన జీవనం సాగించలేదని దుస్థితి కొనసాగుతోంది.

రాష్ట్రంలో ఒకేసారి 16మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామంటూ చెప్పుకుంటున్న పాలకులు మన్యం జిల్లాకు మాత్రం ముఖం చాటేశారు. పార్వతీపురంలోని ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా మాత్రమే మార్చారు. కురుపాంలోని ప్రభుత్వం ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఎంఎ, ఎం.కామ్, ఎంఎస్సీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ వంటి పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు జిల్లాలో లేవు. గిరిజన యూనివర్శిటీ నిర్మాణానికి కేంద్రం నిధులు ఇవ్వలేదు. జిల్లా, రాష్ట్రానికి చెందిన పాలకులు ప్రశ్నించడం లేదు. మరోవైపు గిరిజన ప్రాంతాల్లో చాలా గ్రామాలకు రోడ్లు లేవు. వైద్య సేవల కోసం డోలి మోత తప్పడం లేదు. రక్షిత తాగునీటి పథకాలు లేక చలమనీరే గత్యంతరంగా ఉన్న గిరిజన గూడలెన్నో. బడిలేని గ్రామాలూ అనేకం ఉన్నాయి. గడిచిన ఏడాదిలో ఇవేవీ అధికార యంత్రాంగానికి పెద్దగా పట్టలేదు. కేలం నవరత్నాల్లో భాగంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుకే పరిమితమైంది. ఇవి కూడా అందని అర్హులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తునే ఉన్నారు. ఇప్పటికైనా జిల్లాను వ్యవసాయ, పారిశ్రామిక, సేవా, పర్యాటక రంగాల్లో అభివృద్ధి సమగ్ర ప్రణాళిక రూపొందించి, నిర్ధిష్టమైన కాలపరిమితిలో అభివృద్ధి సాధించేందుకు కృషిచేయాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు.

# ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

- 33మంది విద్యార్థులు గైర్హాజరు
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి- కలెక్టరేట్

జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 64 పరీక్ష కేంద్రాల్లో జరిగిన తెలుగు పరీక్షకు 10776 మంది విద్యార్థులు హాజరు కాగా, 33 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌డివి రమణ తెలిపారు. మొదటిరోజు ఎటువంటి అవంతరాలు లేకుండా ప్రశాంతంగా జరిగాయన్నారు. సీతానగరం మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలను, ఇతర స్క్వాడ్లు కలిసి 26 పరీక్ష కేంద్రాలను తాను పర్యవేక్షించినట్లు తెలిపారు.

**పార్వతీపురంరూరల్ :** గరుగుబిల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ నిశాంత్ కుమార్ తనిఖీ చేశారు. విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం ఉందన్నారు. జిల్లాలో 64 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 210 పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని చెప్పారు. ఎపి ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలకు 6 కేంద్రాలు, ఇంటర్ పరీక్షలకు 2 కేంద్రాలు ఏర్పాటు చేశామని, అందులో 751 మంది పదో తరగతి, 479 మంది ఇంటర్ పరీక్షలు రాస్తారని ఆయన చెప్పారు. 650 మంది ఇన్విజిలేటర్లను, 12 మంది రూట్ అధికారులను, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించామని వివరించారు. పరీక్షా కేంద్రాలకు కిలో మీటరు దూరాన గల జెరాక్స్ దుకాణాలు మూసి వేయాలని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ అన్నారు.

పార్వతీపురం మండలంలో 3కేంద్రాల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష ఉదయం 9.30గంటలకు ప్రారంభమైనప్పటికీ విద్యార్థులు 8గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. 8.45గంటలకు పరీక్షా కేంద్రాలకు అనుమతించగా, తమకు కేటాయించిన గదులు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకోవడానికి పోటీపడ్డారు. డోకిశిల గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల కేంద్రంలో యర్రసామంతవలస, ములగ, కవిటిభద్ర కెజిబివి, రావికోన, తాళ్లబురిడి డోకిశిల ఉన్నత పాఠశాలలోనూ, పెదబొండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో అదే పాఠశాలకు చెందిన విద్యార్థులతో పాటు బందలుప్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎమ్మార్‌నగరం కేంద్రంలో అదే పాఠశాలకు చెందిన విద్యార్థులు శతశాతం హాజరయ్యారని ఆయా కేంద్రాల చీఫ్‌లు, తిరుపతిరావు, వెంకటనాయుడులు తెలిపారు. ఎటువంటి



హాల్‌టిక్కెట్ల నెంబరు చూస్తున్న విద్యార్థినులు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ ఎస్ఐ సింహాచలం ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. అలాగే నారాయణస్కూల్, సురేస్‌స్కూల్‌లో పట్టణానికి చెందిన విద్యార్థులు పరీక్షలు రాశారు.

**జియమ్మవలస :** మండలంలో చినమేరంగి, జియమ్మవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జియమ్మవలస ఉన్నత పాఠశాలలో జియమ్మవలస పాఠశాల విద్యార్థులతో పాటు బిజె పురం, వనజ, జియమ్మవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు 151మంది, చినమేరంగి పాఠశాలలో చినమేరంగి పాఠశాలతో పాటు పెదమేరంగి, చినమేరంగి కెజిబివి పాఠశాల, చినకుదమ, పెదమేరంగి సత్య కైలాస్ పాఠశాలల నుంచి 241 మంది టెన్త్ పరీక్షలు రాశారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పోలీసులు బందోబస్తుతో పరీక్షలు ప్రశాంతంగా అధికారులు నిర్వహించారు.

**కురుపాం :** మండలంలోని పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, ధర్మలక్ష్మీపురం మూడు పరీక్ష కేంద్రాల్లో 671 మంది విద్యార్థులకు ఒకరు గైర్హాజరయ్యారు. మొదటిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. స్క్వాడ్, ఎంపిడిఒ రెండు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

**భామిని:** మండలంలోని బత్తిలి, భామిని జిల్లా పరిషత్ హైస్కూళ్లు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకలంలో నిర్వహించిన పదోతరగతి పరీక్షల్లో 520 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బత్తిలి హైస్కూల్‌లో కె.వెంకరటరమణ, భామిని హైస్కూల్‌లో ఆర్ వి రమణ, బాలయోగి గురుకులం పరీక్ష కేంద్రంలో ఎంవి నిర్మల ఎగ్జామ్స్ చీఫ్ గా వ్యవహరించారు.

**వీరఘట్టం :** మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల పరీక్ష కేంద్రాలతో పాటు గంగంపేట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, బిటివాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, నీలానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ కేంద్రాల్లో 735 మంది విద్యార్థులకు గానూ నలుగురు గైర్హాజరయ్యారు.

# మాదక ద్రవ్యాలపై నిఘా : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో మత్తు, మాదక ద్రవ్యాలపై పటిష్టమైన నిఘా ఉండాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మాదక ద్రవ్యాల జాఢ్యం సమాజంలో పెరుగుతుందని, ఆదిలోనే అరికట్టాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల నియంత్రణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. మత్తు, మాదక ద్రవ్యాల నియంత్రణ పక్కాగా ఉండాలని, విద్యా సంస్థల్లో అధిక సంఖ్యలో అవగాహన చేపట్టాలని సూచించారు. విద్యాశాఖ కీలక పాత్ర పోషించి యువత చెడు మార్గాలు పట్టకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కొండ శిఖరాలపై గంజాయి వంటి మాదక ద్రవ్యాల సాగుపై నిఘా ఉండాలని, వాటి వెనుక ఎవరి హస్తం, ప్రోత్సాహం ఉందో గుర్తించాలని అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా తదితర ఏ రూపంలో ఉన్న తీవ్రమైన నేరంగా పరిగణించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలు, కొండ శిఖరాలపై గంజాయి, ఇతర మత్తు, మాదక ద్రవ్యాల పంటలు పండించే అవకాశాలు ఉంటాయన్నారు. ఇవి ఎక్కడ ఉన్నా కమిటీ సభ్యులు గమనించాలన్నారు. బడి, గుడి వంటి ప్రదేశాల్లో కూడా నిఘా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మత్తు పదార్థాల వినియోగం నియంత్రించే డీ ఎడిక్షన్ కేంద్రాలు, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు. రవాణా వ్యవస్థ పై నిఘా ఉందని, 2లక్షల మెట్రిక్ టన్నుల మత్తు పదార్థాల పంటను గత ఏడాది నాశనం చేశామని వివరించారు. సమావేశంలో ఎఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, జిల్లా అటవీశాఖ అధికారి జి.ఎ.పి ప్రసూన, ఆర్‌డిఒ కె.హేమలత, డిఎంహెచ్ఒ బగాది జగన్నాథరావు, జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారి ఎ.లావణ్య, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి.సూర్యనారాయణ, విద్యాశాఖ ఎడి వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి

# సమాన పనికి సమానవేతనం ఇవ్వాలి

## కెజిబివి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి కొమరాడ

సమగ్ర శిక్షా , కెజిబివి లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రాల్లోని, ఎంఇఒ కార్యాలయాల వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. కొమరాడలో జరిగిన నిరసనలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల విజయకుమారి నాయకులు మాట్లాడుతూ సమగ్ర శిక్షా , కెజిబివి లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖలలో, విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైంస్కేలు అమలు చేసి, వేతనాలు పెంచి 15 నెలలు గడుస్తున్నా సమగ్ర శిక్షా ఉద్యోగుల వేతనాల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం చొరవ చూపడం లేదన్నారు. . వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు మంజూరు చేయాలని, మెరుగైన హెల్త్ స్కీం అమలు చేయాలని, పని భారం తగ్గించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు 5 స్పెషల్ లీవ్‌లు మంజరు చేయాలని, 11వ పిఆర్‌సి ప్రకారం లీవ్ లను అమలు చెయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

**వీరఘట్టం**: మండలం రేగులపాడు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో సిబ్బంది ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఫిబ్రవరి మార్చి నెలలో జీతాలు చెల్లించలేదని, కాంటాక్ట్ పద్ధతుల పనిచేస్తున్న ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలని, ఔట్సోర్సింగ్ లో పనిచేస్తున్న ఉద్యోగులకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు నియమించాలని, తదితర డిమాండ్స్ పై నిరసన తెలియజేశారు.



కొమరాడలో నిరసన తెలుపుతున్న కెజిబివి ఉద్యోగులు



రిలే నిరాహారదీక్ష చేస్తున్న గిరిజనులు, ప్రజాసంఘాల నాయకులు

## బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

# గిరిజనుల రిలే నిరాహారదీక్షలు

ప్రజాశక్తి - కొమరాడ


బోయ, వాల్మీకి కులస్తుల్ని గిరిజన జాబితాలో చేర్చేలా అసెంబ్లీలో చేసిన తీర్మానం రద్దు చేయాలని గిరిజన సంఘం నాయకులు ఊర్లక కామయ్య, భాస్కరరావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం గిరిజన సంఘ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బోయ, వాల్మీకి కులస్తుల్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని ముఖ్యమంత్రి జగన్ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడం దుర్మార్గమన్నారు. వెంటనే ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేవలం ఒక కులం ఓట్లు కోసం రాష్ట్రంలోని అన్ని గిరిజన తెగలకు అన్యాయం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో అప్పలస్వామి, రాముడు, గణేష్, ప్రసాద్, భీమయ్య, రామారావు, రామస్వామి, ప్రసాదు, నవీన్, రవి, సుందర్‌రావు, రాజు, ఉగాది వెంకటరావు, దుర్గారావు, జనార్ధన్ పాల్గొన్నారు .

# టిడిపిలో ముసలం!

- అనూహ్య రీతిలో పార్టీ మండల అధ్యక్షుడిగా ముఖీ
- కేడర్ అభిప్రాయం తీసుకోకుండా ఎంపిక
- నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఏకపక్ష నిర్ణయంపై నాయకులు విస్మయం

ప్రజాశక్తి - సాలూరు/పాచిపెంట

పాచిపెంట మండల టిడిపిలో గ్రూపు రాజకీయాలు పతాకస్థాయికి చేరాయి. ఇంతవరకు నివురుగప్పిన నిప్పులా ఉన్న మండల రాజకీయాలు ఇప్పుడు భగ్గుమన్నాయి. పార్టీ మండల అధ్యక్షుడిగా సీనియర్ నాయకులు ముఖీ సూర్యనారాయణను నియోజకవర్గ ఇన్చార్జి జి.సంధ్యారాణి ఎంపిక చేశారు. సోమవారం ఆమె నివాసంలో జరిగిన నియోజకవర్గ పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో అధ్యక్షుడిగా ఎన్నికైన సూర్యనారాయణను మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్‌తో పాటు సాలూరు, మక్కువ, మెంటాడ మండలాల నాయకులు అభినందించారు. గత కొంతకాలంగా టిడిపి మండల అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి వైఖరితో విభేదిస్తూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఆయన లేకుండానే మండలంలో పార్టీ కార్యక్రమాల్లో సంధ్యారాణి పాల్గొంటున్నారు. పిన్నింటికి ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని తయారు చేయాలనే యోచనలో ఉన్న సంధ్యారాణి దాన్ని ఇప్పుడు కార్యరూపం దాల్చేలా చేశారు. పార్టీలో తనను వ్యతిరేకించిన నాయకులు ఎంతటి బలవంతులైనా పక్కన పెట్టాలనే నిర్ణయానికి ఆమె వచ్చినట్లు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్ అనుచరుడైన పిన్నింటి ప్రసాద్‌బాబు మాజీ ఎంపిపిగా మండలంలో బలమైన సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. ప్రసాద్‌బాబు తండ్రి ఈశ్వరరావు కూడా టిడిపి ప్రభుత్వం హయాంలో జెడ్పీ వైస్‌చైర్మన్‌గా పని చేశారు. మండల రాజకీయాల్లో మూడు దశాబ్దాలుగా కీలకపాత్ర పోషిస్తున్న ప్రసాద్‌బాబు మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తల అభీష్టం మేరకు మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాంటి నాయకుడ్ని పక్కన పెట్టి మూడు పంచాయతీలకే పరిమితమైన సామాజిక వర్గానికి చెందిన సూర్యనారాయణను మండల పార్టీ అధ్యక్షుడిగా ఎంపిక చేయడం పార్టీ శ్రేణులను విస్మయానికి గురి చేస్తోంది. మండలంలో 29పంచాయితీలకు గాను 15పంచాయితీలకు గ్రామకమిటీలు ఉన్నాయి. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామకమిటీలతో సమావేశం నిర్వహించకుండా కొద్దిమంది నాయకుల అభిప్రాయం మేరకు మండల అధ్యక్షుడ్ని మార్చడం వివాదాస్పదమవుతోంది. సమీప భవిష్యత్తులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మండలపార్టీని ఏకతాటిపై నడిపించడంలో నియోజకవర్గ నాయకత్వం విఫలమయిందనే వాదనలు వినిపిస్తున్నాయి.



సూర్యనారాయణను అభినందిస్తున్న సంధ్యారాణి, భంజ్‌దేవ్, నాయకులు

### మండల పార్టీ అధ్యక్షుడ్ని నేనే: పిన్నింటి ప్రసాద్ బాబు

మండల టిడిపి అధ్యక్షుడిగా నేనే ఉన్నాను. నన్ను తొలగించినట్లు సమాచారం అందలేదు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామకమిటీలతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయం మేరకు మండల పార్టీ అధ్యక్షుడ్ని ఎంపిక చేయాలి. సోమవారం నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి నివాసంలో జరిగిన సమావేశానికి తనను పిలవ లేదు. పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి వుంటాను.

## నేడు శ్రమదానం

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లా అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళ వారం పెద్ద ఎత్తున "శ్రమదానం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పార్వతీపురం పట్టణానికి జిల్లా కేంద్రంకు ఉండాల్సిన హంగులు ఉండాలన్నారు. మంగళ వారం ఉదయం 6 గంటలకు శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కలెక్టరేట్ ఆవరణ, చుట్టు పక్కల, ఇతర ప్రాంతాల్లో శ్రమదానం జరుగుతుందని అన్నారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చిన ఉద్యోగులను బృందాలుగా విభజించి ఒక్కో బృందానికి ఒక్కో ప్రాంతాన్ని ఇస్తామన్నారు. బాగా చేసిన బృందానికి బహుమతులు అందించేందుకు యోచిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి వారం శ్రమదానం చేసి కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు.

**ప్రజలు భాగస్వామ్యం కావాలి**

పట్టణ పారిశుధ్యం, సుందరీకరణలో భాగంగా శ్రమదానం కార్యక్రమంలో పట్టణ ప్రజలు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. పట్టణం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**5న ప్రహరీ ప్రారంభం**

జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రహరీ, గేట్లను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఈనెల 5న ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## జాతీయస్థాయి తైక్వాండోలో ప్రతిభ

**బొబ్బిలి:** రాజస్థాన్ రాష్ట్రంలోని కోటాలో గతనెల 28 నుంచి 31 వరకు జరిగిన జాతీయ స్థాయి టైక్వాండో పోటీలలో బొబ్బిలి క్రీడాకారిణి బి. యశస్విని ప్రతిభ కనబరిచింది. ప్రతిభ కనబరిచిన యశస్వినిను టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన కోటలో సోమవారం అభినందించారు. సబ్ జూనియర్ అండర్ 20 కిలోల వెయిట్ కేటగిరీలో యశస్విని పాల్గొని కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నట్లు కోచ్ బంకురు ప్రసాద్ చెప్పారు. టైక్వాండో పోటీలలో జాతీయ స్థాయిలో బొబ్బిలికు పతకం తీసుకురావడం సంతోషంగా ఉందని బేబినాయన అన్నారు.

## మే 15 నాటికి సర్వే రాళ్లు

**పార్వతీపురం :** జిల్లాలో రీ సర్వే పూర్తి అయిన గ్రామాల్లో మే 15 నాటికి సర్వే రాళ్లు పాతాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. డివిజన్, మండల అధికారులతో సోమవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పలు అంశాలను సమీక్షించారు. సర్వే రాళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలు ఏప్రిల్ 15 నాటికి పూర్తి చేయాలని, డివిజనల్, మునిసిపల్ ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ పక్కాగా ఉండాలని అన్నారు. మానస సరోవరం పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మేజిక్ సోక్ పిట్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, హౌసింగ్ పీడీ పి.రఘురాం, డిపిఒ బి.సత్యనారాయణ, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె.రాజ కుమార్, విద్యా శాఖ సహాయ సంచాలకులు వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మీపురంలో కాలువలను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

## లక్ష్మీపురాన్ని పరిశీలించిన టిడ్కో చైర్మన్

**సీతానగరం :** మండలంలోని లక్ష్మీపురం గ్రామాన్ని రాష్ట్ర టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ సోమవారం సందర్శించారు. గ్రామంలో రైతులతో పలు అంశాలపై మాట్లాడారు. చెరకు కర్మాగారం ఎత్తివేతపై రైతులు నిలదీశారు. ఎన్‌సిఎస్ చక్కెర కర్మాగార పరిధిలోని చెరకు సంకిలి వైపు తరలింపులో దళారుల ప్రమేయంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు తెలిపారు. గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి సత్యవతి, ఎంపిటిసి పార్వతమ్మ గంగునాయుడు ఇతర గ్రామపెద్దల ఆహ్వానం మేరకు సందర్శన చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామములో ఉన్న రోడ్డు సదుపాయాలను అక్కడి రైతులు, నాయకులతో కలిసి పరిశీలించారు. అవసరమైన చోట వెనువెంటనే బాగుచేసేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొని వెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గంగునాయుడు, శ్రీనివాస్ పువ్వల అప్పారావు, రాము, మాజీ సర్పంచ్ గాజాపు వెంకట నాయుడు, చప్ప ఉమామహేశ్వరరావు, గవర చిన్నంనాయుడులు పాల్గొన్నారు.


సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ వర్కర్లు, నాయకులు

## సుబ్బారావుకు ఘన నివాళి

**పాలకొండ రూరల్ :** ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ పాలకొండ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ యూనియన్ నాయకులు, రాష్ట్ర మాజీ అధ్యక్షులు జి.సుబ్బారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు పాలకొండ మండల కమిటీ కార్యదర్శి కాద రాము మాట్లాడుతూ ప్రజల, కార్మికుల, బడుగు, బలహీన వర్గాల సమస్యలపై, మున్సిపాలిటీ కార్మికుల కోసం అనేక పోరాటాలు చేసిన మహానుయోధుడు సుబ్బారావు అని కొనియాడారు. సుబ్బారావు ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్.సంజీవ్, అంజి, కిషోర్ మధు, రాజా తదితరులు పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

## బాలగొడబలో ఫ్యామిలీ ఫిజిషియన్

**పార్వతీపురంరూరల్ :** మండలంలోని బాలగుడబలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని బందలుప్పి వైద్యాధికారి డాక్టర్ పి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరానికి 60 ఏళ్లు, ఆ పైబడిన వారు, గర్భిణీలు, చిన్న పిల్లలు, బాలింతలు వచ్చారు. వీరికి కావాల్సిన వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అలాగే సుగర్, బిపి, ఆస్తమా ఫిట్స్ మొదలగు వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కావాల్సిన మందులు ఇస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఈ వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పోలమ్మ, 104 సిబ్బంది ఆనందరావు, సంతోష్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## దరఖాస్తుల పరిశీలన

**వీరఘట్టం:** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో వంగర మండలంలోని అంగన్వాడీ కార్యకర్తల పోస్టులకు సంబంధించి 2, హెల్పర్లకు సంబంధించి 7గురు అభ్యర్థుల నుంచి 23 దరఖాస్తులు వచ్చినట్లు సిడిపిఒ పూర్ణిమ తెలిపారు. ఈనెల 4న విజయనగరం జిల్లా చీపురుపల్లి ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించనున్న ఇంటర్వ్యూకు అర్జీదారుల నుంచి వచ్చిన 23 దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆమెతో పాటు సీనియర్ సహాయకులు రాంబాబు ఉన్నారు.

## ఓపెన్ ఇంటర్ పరీక్షకు 20 మంది గైర్హాజరు

**వీరఘట్టం :** స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలకు 20మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ దూసి నాగమణి తెలిపారు. 217 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ 20 మంది హాజరు కాలేదన్నారు.

## 6న పిడిఎస్ బియ్యం వేలం

**కొత్తవలస :** మండలంలో పట్టుకున్న పిడిఎస్ బియ్యాన్ని ఈనెల 6న వేలం వేయనున్నట్లు సిఎస్‌డి టి. రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వీరభద్రపురం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉన్న 67.22 క్వింటాలు పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనపరుచుకొని ఎంఎల్ఎస్ పాయింటుకు తరలించామన్నారు. ఆ బియ్యాన్ని వేలం వేస్తామన్నారు.

# పరిష్కారం దిశగా స్పందన వినతులు


వినతులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి - కలెక్టరేట్

స్పందన కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జెసి ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్‌ఒ జె.వెంకటరావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. 80 దరఖాస్తులు స్పందన కార్యక్రమంలో అందాయి. అర్జీల వివరాలిలా ఉన్నాయి...

పార్వతీపురం మండలం కొత్తూరులో ఉన్న ప్రభుత్వ శ్మశాన వాటిక ఆక్రమణకు గురైనందున రీ సర్వే జరిపించి శ్మశానానికి రక్షణ కల్పించాలని హెచ్.సోదరం, ఇతరులు వినతి పత్రం సమర్పించారు. మారుమూల గ్రామాలైన తమ్మన్నదొరవలస, మాదాపురం, కోనవలస, బొడ్డవలస జియో మొబైల్ టవర్ ఏర్పాటు చేయాలని కొత్తరుకు చెందిన హెచ్.సంగయ్య కోరారు. భామిని మండలం నులకజోడు లోవలికి అసగా వంశధార రిజర్వాయర్ కాలువకు ఆనుకొని ఉన్న రహదారి మీదుగా వర్షం పడడం వల్ల రాకపోకలు సాగించడానికి ఇబ్బందిగా ఉందని, కావున ప్రధాన రహదారి మంజూరు చేయాలని, భామిని గ్రామపంచాయతీ పరిధిలో ఎస్‌బిఐ బ్రాంచ్ ఏర్పాటు చేయాలని కె.ప్రసాద్, గ్రామస్తులు దరఖాస్తు అందజేశారు. కొమరాడ మండలం గాజులుగూడకు చెందిన కె.మల్లేశ్వరరావు, కెమిశీల నుంచి గాజులుగూడకు చెందిన రోడ్డు నిర్మించాలని కోరారు. సాలూరు మండలం కొత్తవలస, దాగరవలసకు 20ఏళ్ల నుంచి రోడ్డు సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గదబబొడ్డవలస నుంచి ఎగువదాగరవలస వరకు రోడ్డు ఏర్పాటు చేయాల్సిందిగా ఎస్.జైసింహ కోరారు. సీతంపేట మండలం తాడిపాయి పంచాయితీ పరిధిలో ఉన్న గ్రామాలకు సిసి రోడ్డు మంజూరు చేయాలని కె.సరోజిని, ఇతరులు దరఖాస్తు అందజేశారు. గరుగుబిల్లి మండలం పిట్టలమెట్టకు చెందిన ఎం.నారాయణరావు మూడేళ్లుగా గోసాలలు బిల్లులు రావడం లేదని అర్జీ అందజేశారు. సాలూరు మండలం జిల్లేడువలసకు సిహెచ్ లచ్చమ్మ పిటిజి గొర్రెలు లోను మంజూరు చేయాల్సిందిగా కోరారు. వీటితో పాటు మరిన్ని దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించండి : పిఒ


ఫిర్యాదులను వింటున్న ఐటిడిఎ పిఒ నవ్య

**సీతంపేట :** గిరిజన సమస్యలను పరిష్కరించాలని పలువురు గిరిజనులు స్పందన కార్యక్రమంలో వినతులు సమర్పించారు. ఐటిడిఎ పిఒ బి.నవ్య ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. మాలువకు చెందిన పోలయ్య చెక్‌డాం మంజూరు చేయాలని, కాలనీకి శ్మశాన వాటిక రోడ్డు మంజూరు చేయాలని రూప విన్నవించారు. సవర తిడ్డిమికి కల్వర్టు మంజూరు చేయాలని ప్రవీణ్‌కుమార్, బొడ్డగూడకు చెందిన బసవరాజు రోడ్డు మరమ్మతు చేయాలని కోరారు. గొట్టలక్ష్మీపురానికి చెందిన స్వాతి ఆశా వర్కర్ పోస్టు మంజూరు చేయాలని, భరణికోటకు చెందిన రంగారావు రోడ్డు సదుపాయం కల్పించాలని వినతిని అందజేశారు. జి.గుమ్మడకు చెందిన కొండ గొర్రె అమ్మన్న జీడి పంటకు నష్టపరిహారం చెల్లించాలని, కడంబ సింగిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు విన్నవించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## సర్పంచ్, కార్యదర్శులను విధుల నుంచి తొలగించండి

ప్రజాశక్తి - కలెక్టరేట్

పెదమరికి పంచాయతీ నిధులను దుర్వినియోగం చేసిన పంచాయతీ సర్పంచ్, పంచాయతీ సెక్రటరీని శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలని ఆ గ్రామంలోని యువకులు, జనసేన కార్యకర్తలు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెదమరికి పంచాయతీ నిధులను దుర్వినియోగం చేసిన పంచాయతీ సెక్రటరీ ఇదివరకే తొలగించినప్పటికీ, దుర్వియోగమైన నిధులను వారి నుంచి రికవరీ చేయించాలని, ఇలాంటి అక్రమ పనులు మళ్లీమళ్లీ పునరావృతం కాకుండా ఉండాలంటే పెదమరికి గ్రామ పంచాయతీ సర్పంచును, పంచాయతీ సెక్రటరీని పూర్తిగా విధుల నుండి తొలగించి, ప్రజల సమక్షంలోనే వారి వద్ద నుంచి డబ్బులు రికవరీ చేయడం ద్వారా సమాజంలో ఏ సర్పంచ్ అయినా, అధికారైన ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన శిక్షలు తప్పవని సమాజానికో హెచ్చరికలా ఉంటుందని అన్నారు.

# పంట నష్టాలను జెడి పరిశీలన


దెబ్బతిన్న మొక్కజొన్నను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ జెడి రాబర్ట్‌పాల్

ప్రజాశక్తి -భామిని

మండలంలోని ఇటీవల కురుసిన అకాల వర్షాలకు, గాలులకు నష్టపోయిన పంటలను వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.రాబర్ట్‌పాల్ సోమవారం పరిశీలించారు. మండలంలోని సోలికిరి, బాలేరు, డిమిడిజోల గ్రామాల్లో నష్టపోయిన మొక్కజొన్న, నువ్వులు, పెసర పంటలను పరిశీలించారు. మండలంలో సుమారు 90 ఎకరాల్లో మొక్కజొన్న, 35 నుంచి 40 ఎకరాల్లో పెసర, ఆరు ఎకరాల్లో నువ్వు పంటకు నష్టం వాటిల్లినట్టు గుర్తించామని జెడి తెలిపారు. ఈ విషయంపై రైతులతో చర్చించి పంట నష్ట అంచనాల జాబితాను సకాలంలో ప్రభుత్వానికి అందజేసి పంట నష్టం రైతులకు అందేలా చూస్తామని రైతులకు భరోసా కల్పించారు. తదుపరి గ్రామ వ్యవసాయ సహాయకులతో సమావేశం ఏర్పర్చి పంట నష్ట వివరాలను త్వరితగతిన రైతుల నుంచి సేకరించి నష్టపోయిన ప్రతి రైతుకు తగు న్యాయం జరిగేలా పంట నష్ట జాబితాను సకాలంలో అందించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.రత్నకుమారి, ఎఒ కె.సింహాచలం, అశోక్‌తో పాటు మండలంలో గల గ్రామ వ్యవసాయ సహాయకులు ఆర్.జ్యోతి, దుర్గాప్రసాద్, ఆలీషా, ఎంపిటిసి కొత్తకోట చంద్రశేఖర్, రైతులు దామోదర కృష్ణ, కొత్తకోట నీలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# క్షతగాత్రులను పరామర్శించిన టిడిపి ఆశావాహులు


బాధితులకు ఆర్థికసాయాన్ని అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని సర్వపాడులో రెండు రోజుల క్రితం జరిగిన గోడ కూలిన ఘటనలో మృతి చెందిన కుటుంబాలను గాయలైన వారి కుటుంబాలను నియోజకవర్గ టిడిపి ఆశావాహులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దత్తి లక్ష్మణరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో అనేక ప్రమాదాలు జరుగుతున్నా కనీసం ఎమ్మెల్యేలు, మంత్రులు స్పందించడంలేదన్నారు. అదే టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉంటే తక్షణమే పరామర్శించి ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయ సహకారాలు అందించేవారన్నారు. ప్రమాదంలో మృతి చెందిన గిరిజనుల కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పే ప్రజాప్రతినిధి నియోజకవర్గంలో కరువయ్యారని అన్నారు. పరామర్శించిన అనంతరం ఆశావాహులు కొంత ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈయనతో పాటు గరుగుబిల్లి మాజీ ఎంపిపి డి.సత్యనారాయణ, ఆశావాహులు తమ్మయ్య, పద్మావతి, వెంకట నాయుడు, మీసాల శశిభూషణ, దాలినాయుడు, లేవిడి లక్ష్మణ రావు, బి. కొండల రావు, పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

## నవజాత శిశువులపై జాలి చూపండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక జిల్లా ఆస్పత్రిలోని నవజాత శిశువులపై జాలి చూపాలని జనసేన నాయకులు కోరారు. సోమవారం జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్‌ను జనసేన నాయకులు కలిసి జిల్లా ఆసుపత్రిలో స్పెషల్ న్యూ బార్న్ కేర్ యూనిట్ ఎస్ ఎన్ సి యు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన నవజాత శిశువుల సంరక్షణకై జిల్లా ఆసుపత్రిలో ఎస్‌ఎన్‌సియు ఏర్పాటు చేశారన్నారు. దీనిలో గత కొంతకాలంగా ఎసిలు పనిచేయకపోగా, ఫ్యాన్లు కూడా లేవన్నారు. దీంతో అప్పుడే పుట్టిన పిల్లలు ఓవైపు రోగంతో పోరాడుతూ మరోవైపు ఉక్కబోతకు ఉక్కిరిబిక్కిరవుతున్నారని అన్నారు. వేసవి వేడిమి ఒకపక్క, రోగం మరో పక్క వేధిస్తుండడం తో విలవిలలాడుతున్నారన్నారు. తక్షణమే ఏసీలు మరమ్మతులు చేయించడం లేదా ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని కోరారు. గత కొంత కాలంగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. తక్షణమే నవజాతి శిశువులపై జాలి చూపించి చూపించాలన్నారు. ఎస్‌ఎన్‌సియులో అధికంగా గిరిజన ప్రాంతాలకు చెందిన పిల్లలే ఎక్కువగా ఉంటున్నారని, సమస్యను ఎవరికి చెప్పాలో తెలియక తల్లిదండ్రులు ఆవేదం చెందుతు న్నారన్నారు. ఏం సమస్యపై దష్టి పెట్టాలని కోరారు. జెసిని కలిసిన వారిలో జనసేన నాయకులు దాలి నాయుడు, మహేశ్వర అజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## నేటి నుంచి దశమ వార్షికోత్సవం

ప్రజాశక్తి - సీతానగరం

మండల కేంద్రంలోని సువర్ణముఖినదీ తీరాన వెలసిల్లిన రుక్మిణీ సత్యభామసమేత శ్రీవేణుగోపాల స్వామి దేవాలయంతో పాటు శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలలో దశమ వార్షిక మహోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, నిర్వహకులు చెలికాని గోపాలకృష్ణలు తెలిపారు. స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీశోభకత్ నామ సంవత్సర చైత్ర శుక్ల త్రయోదశి నుంచి చైత్ర బహుళ పాడ్యమి వరకు ఈ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మంగళవారం నిత్యారాధనం, అష్టోత్తర కలశాభిషేకం, తిరువీధి, విశ్వక్షేనారాధన, పుణ్యావచనం, అంకురారోపణం, తీర్థ ప్రసాద గోష్ట జరుగుతోందని చెప్పారు. బుధవారం నిత్యారాధనం, అగ్నిప్రతిష్ఠ, పతాకప్రతిష్ఠ తీర్థ ప్రసాద గోష్ట, సుదర్శన నారసింహ యాగం తీర్థ ప్రసాద గోష్ట, నిత్య హెూమాలు ఉంటాయని తెలిపారు. గురువారం నిత్యారాధనం, నిత్యహోమాలు, తీర్థ ప్రసాదగోష్ట, శ్రీవేణుగోపాలస్వామి, శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు, తీర్థ ప్రసాద గోష్ట ఉంటాయని చెప్పారు. చివరిరోజు శుక్రవారం నిత్యారాధనం, నిత్యహెూవాలు, చూర్ణోత్సవం, వసంతోత్సవం, సువర్ణముఖీనదిలో చక్రస్నానోత్సవం, తీర్థ ప్రసాదగోష్ట, ద్వాదశారాధనలు, పూర్ణాహుతి, ధ్వజపతాక విసర్జన, పవలింపుసేవ తీర్థ ప్రసాద గోష్ట ఉంటుందని తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని అర్చకులు కోరారు.

## నేత్రవైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని పి.లేవిడిలో ఏసు తిరుహృదయ దేవాలయం సమీపాన యంగ్ స్టార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. సుమారు 200 మంది నేత్ర పరీక్షలు చేసుకున్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వీరిలో 30 మందికి శస్త్ర చికిత్సకు శంకర్ ఫౌండేషన్ తరలించి కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం ఎస్సై షణ్ముఖరావు, యంగ్ స్టార్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు పి.స్వరాజ్, అమర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కాంగ్రెస్ ఆధ్వర్యాన సత్యాగ్రహం

**శృంగవరపు కోట :** పట్టణంలోని దేవి కూడలి వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద జై భారత్ సత్యాగ్రహ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు పడాల మణిబాబు, హనుమల శెట్టి నానాజీ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డిసిసి రాష్ట్ర అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ ఆదేశాల మేరకు పట్టణంలోని గల అంబేద్కర్ విగ్రహం వద్ద జై భారత్ సత్యాగ్రహ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొవాలని వారు కోరారు.

## అనాధ పిల్లలకు 'వాత్సల్య'

ప్రజాశక్తి - సీతంపేట

ఏ ఆధారం లేని అనాధ పిల్లల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాత్సల్య పథకాన్ని అమలు చేస్తుందని ఐసిడిఎస్ సిడిపిఒ పి.రంగలక్ష్మి తెలిపారు. అర్హులైన అభ్యర్థుల కోసం ఈనెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి ఆదరణ లేకుండా బంధువులు, ఇతర సంరక్షణలో పెరుగుతున్న బాల బాలికలకు విద్యాభ్యాసం కోసం ఈ పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. 18ఏళ్లలోపు అనాధ బాలల్లో దీనిలో స్పాన్సర్షిప్ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు.

## నేడు ఆసరా చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మహిళా సంఘాల సభ్యులకు వైయస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరగనున్నట్లు ఎంపిడిఒ దేవకుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈ కార్యక్రమం జరగనుందని డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర చేతుల మీదుగా అందరికీ మహిళా సభ్యులందరికీ చెక్కులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖ అధికారులు, మహిళా మండలి సభ్యులు పాల్గొనాలని కోరారు.

## 5న ఆసరా చెక్కులు పంపిణీ

**సీతంపేట :** ఈనెల 5న వైయస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ బి.నవ్య సోమవారం తెలిపారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక ఐటిడిఎలోని గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి హాజరుకానున్నారని తెలిపారు. కావున అర్హులైన లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

## నేడు సాధారణ సమావేశం

ప్రజాశక్తి - పాలకొండ

మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపిపి బొమ్మాలి భాను అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపిడిఒ దొంక త్రినాధులు తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

## గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నివాళి

ప్రజాశక్తి- బొబ్బిలి

జై భారత్ సత్యాగ్రహం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పారాది గ్రామంలో మహాత్మ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు సోమవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పిసిసి మెంబర్, బొబ్బిలి పట్టణ అధ్యక్షులు మువ్వల శ్రీనివాసరావు మాట్లాడుతూ రాహుల్ గాంధీపై బిజెపి ప్రభుత్వం మానసిక దాడులు చేయడం సిగ్గు చేటన్నారు. ఆయన ఎంపి పదవి పై వేటు వేయడం, పరువు నష్టం దావా, రెండు సంవత్సరాలు జైలు శిక్ష వేయడం, ఇంటిని కాళీ చేయమని చెప్పడం వంటి దాడులకు పాల్పడుతున్నారన్నారు. బిజెపి ప్రభుత్వం చేస్తున్న దాడులను ప్రజలు గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి మెంబర్ మొగుడా వెంకటరమణ, కార్యకర్తలు బాలయ్య, ఆటల కృష్ణ, చీపురు ప్రసాద్, గౌరి నాయుడు, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రచార సామగ్రిని పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

## 7 నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

వైసిపి ఈనెల 7 నుంచి 14 వరకు చేపట్టనున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై సోమవారం మండలంలోని సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులకు దిశా నిర్దేశం చేశారు. ఇందులో భాగంగా అడ్డాపుశిల, బాలగుడబ, నర్సిపురం సచివాల యాల పరిధిలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైసిపి నాయకులు, వాలంటీర్లు కలిసి జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమం సామాగ్రిని పంపిణీ చేశారు. ఈనెల 7నుంచి మండలంలోని 20 సచివాలయాల పరిధిలో ప్రతి గ్రామంలో మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమాన్ని పండగల జరపాలని ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన సంక్షేమాన్ని గుర్తు చేస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ గత ప్రభుత్వంలో జరిగిన మోసాలను వివరిస్తూ జగనన్న ప్రభుత్వానికి మద్దతు కూడగట్టేలా గృహ సారథులు కన్వీనర్లు వాలంటీర్లు పని చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బొమ్మి రమేష్ గారు, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, జడ్పిటిసి ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, జెసిఎస్ కన్వీనర్ బంకపల్లి వాసుదేవరావు, చినబొండపల్లి ఎంపిటిసి బంకురు రవికుమార్, సీనియర్ నాయకులు కసత్యనారాయణ, గుర్రాజు పాల్గొన్నారు.

## పైపులైన్ పనులకు శంకుస్థాపన

**విజయనగరం టౌన్ :** నగరంలోని అయ్యన్నపేట రాజవీధి, కొత్త వీధి ప్రాంతాలలో పైప్ లైన్లు ఏర్పాటుకు సోమవారం మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి శ్రీకారం చుట్టారు. రూ.4 లక్షలతో చేపట్టనున్న పైపులైన్లు ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. సందర్భంగా మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ నగరాన్ని కార్పొరేషన్ స్థాయికి తగ్గ హంగులు ఏర్పాటు చేసేందుకు నగరమంతా అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. శంకుస్థాపన వారోత్సవాల పేరిట మూడున్నర కోట్ల రూపాయలతో 50 పనులు చేపడుతున్నట్లు చెప్పారు. త్వరలోనే ప్రారంభ వారోత్సవాలను కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. వార్డు పర్యటనలు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి వాటిని పరిష్కరించే దిశగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి,స్థానిక కార్పొరేటర్ సైలాడ ఈశ్వరమ్మ, జోనల్ ఇన్చార్జ్‌లు దూబే, తమ్మి, కోఆప్షన్ సభ్యులు రహీం, వైసిపి నాయకులు సైలాడ సత్యనారాయణ, మహేష్ పాల్గొన్నారు.

## టిఎఎ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సుభాష్ చంద్ర బోస్

**విజయనగరం టౌన్ :** ట్రై అతులైన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాటూరి సుభాష్ చంద్రబోస్ ఎన్నికయ్యారు. ఈనెల 2న విశాఖపట్నంలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఎన్నికైన ఆయనకు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు అభినందనలు తెలిపారు.

# చిరుధాన్యాలతో సిరులు

ప్రజాశక్తి - పాచిపెంట

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి చిరుధాన్యాలతో సాధ్యమని, కావున వీటి సాగును పెంచాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలో ఆజూరులో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో మాట్లాడుతూ చిరుధాన్యాలతో సిరులు పండించవచ్చని అతి తక్కువ నీరు, ఖర్చుతో వాతావరణ మార్పులను తట్టుకుంటూ అతి తక్కువ కాలంలో రైతులకు ఆదాయాన్ని ఇచ్చే ఏకైక మార్గం చిరుధాన్యాల సాగు అని అన్నారు. గిరిజనుల సాంప్రదాయ పంటలుగా చిరుధాన్యాలను పిలవచ్చన్నారు. చిరుధాన్యాల్లో అనేక పోషకాలు ఉంటాయని, రక్తహీనత, మధుమేహం, గుండె జబ్బులు వంటి వాటికి చిరుధాన్య ఆహారం ఎంతో మేలని తెలిపారు ఎకరా వరి పండించడానికి కావాల్సిన నీటితో మూడు ఎకరాల వరకు చిరుధాన్యాలను ఏడాదిలో మూడు పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రభుత్వమే రైతుల వద్ద నుంచి చిరుధాన్యాలను మద్దతు ధరకు సేకరిస్తుందని, కావున రైతులు చిరుధాన్యాల సాగును పెంచాలని కోరారు.

**నేల తల్లికి నవధాన్యాలు**

నేల బాగుంటే పంట బాగుంటుందని, పంట బాగుంటే మనిషి బాగుంటాడని ఆరోగ్యవంతమైన, నాణ్యమైన దిగుబడులు పొందాలంటే భూమిలో సేంద్రియ పదార్థం ఎక్కువగా ఉండాలని అన్నారు. నవధాన్యాలను కలియ దున్నడం ద్వారా సేంద్రియ పదార్థాన్ని పెంచి భూమిలో జీవ వైవిధ్యం పెరిగి స్థిరమైన అధిక దిగుబడులు పొందవచ్చని అన్నారు. కావున నేల తల్లికి నవధాన్యాలు మానవాళికి చిరుధాన్యాలు తప్పనిసరి అని తెలిపారు అనంతరం చిరుధాన్యాలు, నవధాన్యాల ఆవశ్యకతను తెలుపుతూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విఎఎ నాగమణి, ప్రకృతి సేద్య సిబ్బంది యశోదమ్మ, బాలకృష్ణ, తిరుపతి నాయుడు, సురేష్, రైతులు పాల్గొన్నారు.


ఆజూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

## నేరాలు ఘోరాలు

# లారీని ఢీ కొని డ్రైవర్ మృతి

**రామభద్రపురం :** మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపాన ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీ కొన్న సంఘటనలో డ్రైవర్ క్యాబిన్‌లోనే మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపిన వివరాల మేరకు.. నల్గొండ జిల్లాకు చెందిన గుగ్గుపోతు రాములు అలియాస్ రాము నాయక్ (53) సాలూరు సిమెంట్ లోడ్‌తో వెళుతూ ఆగి ఉన్న లారీని సోమవారం తెల్లవారు జామున ఢీ కొట్టాడు. వాహన ముందుభాగం నుజ్జు నుజ్జు అయ్యి, క్యాబిన్‌లోనే తుది శ్వాస విడిచాడు. లారీ క్యాబిన్‌లో చిక్కుకున్న మృత దేహాన్ని జెసిబి సాయంతో పోలీస్‌లు బయటకు తీశారు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు చేరవేసి మృత దేహాన్ని సిహెచ్‌సికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.